సాక్షి కర్నూలు

ఆదివారం । 26 । మే । 2024



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: మహానంది పుణ్యక్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



అల్లర్లకు పాల్పడితే చర్యలు

హొళగుంద: ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని రాజకీయ పార్టీ నేతలను ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు హెచ్చరించారు.



రమణీయం.. రథోత్సవం

కోవెలకుంట్ల పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 90 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన పరీక్షలకు 90 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 8,435 మందికి గాను 7,621 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 466 మందికి గాను 418 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, నంద్యాల పీఎస్‌సీ అండర్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు చొప్పున మొత్తం ముగ్గురు విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

ఇంటర్‌లో ఇద్దరు డిబార్

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో శనివారం జరిగిన పరీక్షకు ఓ కార్పొరేట్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు మాస్ కాపీయింగ్ పాల్పడుతుండగా చీఫ్ సూపరింటెండెంట్ గమనించి డిబార్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఫస్ట్ ఇయర్ పరీక్షకు 9,288 మంది విద్యార్థులకు గాను 8,970 మంది హాజరుకాగా, 315 మంది గైర్హాజరయ్యారు. సెకండ్ ఇయర్ పరీక్షకు 906 మందికి గాను 830 మంది హాజరు కాగా, 76 మంది గైర్హాజరైయినట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురువయ్య శెట్టి తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 67 శాతం గైర్హాజరు..

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 1,151 మంది విద్యార్థులకు గాను కేవలం 378 మంది మాత్రమే హాజరయ్యారు. 773 మంది గైర్హాజరు కావడం గమనార్హం. పరీక్షకు రిజిస్టర్ చేసుకున్న వారిలో 67 శాతం మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈఓ కె.శామ్యూల్ నాలుగు కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 16 కేంద్రాలను తనిఖీ చేశారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ తెలిపారు.

దేవనకొండలో 62.2 మి.మీ వర్షపాతం



కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మే నెల సాధారణ వర్షపాతం 40.1 మి.మీ ఉండగా 25 రోజుల్లోనే 97 మి.మీ వర్షపాతం నమోదైంది. 142 శాతం అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం. శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు 18 మండలాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా దేవనకొండలో 62.2 మి.మీ, అత్యల్పంగా కోడుమూరులో 0.4 మి.మీ వర్షం కురిసింది. చిప్పగిరిలో 42.8 మి.మీ, గోనెగండ్లలో 42.6, తుగ్గలిలో 42.4, క్రిష్ణగిరిలో 29.2, కర్నూలు అర్బన్‌లో 23.4, మద్దికెరలో 23.2, పత్తికొండలో 22.6, వెల్దుర్తిలో 20.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కల్లూరు, కర్నూలు రూరల్, సీ.బెళగల్, ఆస్పరి, ఎమ్మిగనూరు తదితర మండలాల్లో ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్నరోజుల్లో కూడా వర్షాలు పడే అవకాశం ఉంది.

ఎన్నికల విధులకు నలుగురు పోలీసు అధికారులు

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో డీజీపీ కార్యాలయం ఉమ్మడి జిల్లాకు నలుగురు పోలీసు అధికారులను నియమించింది. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. సీఐడీ విభాగంలో డీఎస్పీలు కె. సాయి ప్రసాద్, కేటీటీవీ. రమణరావు, షేక్ అబ్దుల్ కరీమ్‌తో పాటు ఏసీబీ విభాగంలో అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్‌ను నియమించారు. కర్నూలు, నంద్యాల జిల్లా ఎస్పీలకు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులో వారికి సూచించారు.

అంటు కట్టు.. తియ్యని లాభాలు రాబట్టు!

మామిడిలో పాత తోటల పునరుద్ధరణ

- కాపునకు రాని చెట్లను తొలగించాల్సిన అవసరం లేదు
- అంటుకట్టుతో కొత్త చెట్ల తరహాలో దిగుబడులు
- ఒకే చెట్టుపై 10–15 వెరైటీల వరకు మామిడి అభివృద్ధి
- ఉమ్మడి జిల్లాలో 2వేల చెట్లలో విజయవంతం



అంటుకట్టు పద్ధతితో అభివృద్ధి చెందిన మామిడి

వెరైటీ కాయలు పండించవచ్చు

తొలుత మా పెరట్లో ఉన్న ఒక మామిడి చెట్టుకు అంటుకట్టే పద్ధతి ద్వారా 12 రకాల వెరైటీలను అభివృద్ధి చేశాం. ఒక్కో రకానికి ఒక మొక్క నాటుకోవాలంటే స్థల సమస్య ఉంటుంది. అంటుకట్టుతో వెరైటీ కాయలను పండించుకోవచ్చు. తోటల్లో కూడా పనికి రాని చెట్లకు ఈ పద్ధతి ఎంతో ఉపయోగం. తక్కువ ఖర్చుతో మేలైన దిగుబడులు సాధ్యం. – నాగేశేషులు, జూపాడుబంగ్లా






అంటుకట్టు పద్ధతి ద్వారా వచ్చిన కొమ్మలు

కర్నూలు(అగ్రికల్చర్): మామిడిలో 50 ఏళ్లు పైబడిన చెట్లను తొలగించడం సహజం. ఇలాంటి చెట్లు కొద్ది వరకు కాపునకు వచ్చినా దిగుబడులు నామమాత్రంగా ఉంటాయి. కొత్త తోటల్లోనూ కొన్ని పనికిరాని చెట్లు కనిపిస్తుంటాయి. ఈ చెట్లు ఇక అనవసరం అనే అభిప్రాయానికి రైతులు వచ్చేస్తుంటారు. ఇక మీదట ఇలాంటి అభిప్రాయాన్ని మార్చుకోక తప్పదు. పాత చెట్లను కూడా అంటుకట్టు పద్ధతితో కొత్త చెట్లుగా అభివృద్ధి చేసుకునే వీలుండటమే అందుకు కారణం. బేనిషా వంటి మంచి రకాలను కూడా వృద్ధి చేసుకొని మంచి దిగుబడులు పొందవచ్చు. మామూలుగా అయితే ఒక్కో రకానికి ఒక మొక్క నాటి పెంచుకోవాల్సి ఉంది. స్థలాభావం వల్ల ఎక్కువ వెరైటీలను అభివృద్ధి చేసుకోలేం. అయితే అంటు కట్టుతో ఒక చెట్టుపైనే ఏకంగా 10–12 రకాల మొక్కలను కూడా అభివృద్ధి చేసుకొని మంచి దిగుబడులు పొందుతుండటం విశేషం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 25 వేల ఎకరాల వరకు మామిడి తోటలు ఉన్నాయి. ఇందులో 50 ఏళ్ల వయస్సు పైబడిన చెట్లు దాదాపు 5వేల ఎకరాల్లో ఉంటున్నాయి. వయస్సు పెరిగే కొద్దీ దిగుబడులు తగ్గుతుండటం, అస్సలు పూత రాకపోతుండటంతో పాత చెట్లను తొలగించే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గత ఐదారేళ్లలో దాదాపు 1,400 ఎకరాల్లో మామిడి చెట్లను తొలగించారు. ఇప్పుడు పాత మామిడితోటలను పూర్తిగా తొలగించాల్సిన అవసరం లేకుండా అంటుకట్టు పద్ధతిని ఉపయోగించి కొత్త తోటలుగా మార్చుకోవడం ద్వారా రైతుల దశ తిరుగుతోంది.

‘చిరు’ సాయం

నంద్యాల జిల్లా మండల కేంద్రమైన జూపాడుబంగ్లాకు చెందిన నాగేశేషులు ఉద్యాన శాఖలో చిరుద్యోగి. అయితే అంటుకట్టు పద్ధతిలో అపారమైన అనుభవం గడించారు. తొలగించడానికి సిద్ధమైన అనేక పాతతోటల్లో వందలాది చెట్లను అంటుకట్టు పద్ధతితో తిరిగి ప్రాణం పోశారు. ఇప్పటి వరకు దాదాపు 2వేల పనికిరాని చెట్లకు అంటు కట్టి కొత్త తోటల అభివృద్ధికి తోడ్పాటును అందించారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 30–40 మంది రైతులు తమ తోటల్లో పనికి రాని చెట్ల స్థానంలో అంటుకట్టు పద్ధతి పాటిస్తున్నారు. ఇలాంటి చెట్లు గత ఏడాది నుంచి కాపునకు వస్తున్నాయి.



అంటుకట్టుతో మేలైన దిగుబడులు



మా తోటల్లో 30 చెట్లు ఎన్ని యాజమాన్య పద్ధతులు పాటించినా కాపునకు రావడం లేదు. అంటుకట్టు పద్ధతి ఫలితం ఇస్తుందని తెలిసి ప్రయత్నం చేశాం. నాలుగైదేళ్ల క్రితం పనికి రాని చెట్టు కొమ్మలను పూర్తిగా తొలగించి మంచి బేనిషా రకాలతో అంటు కట్టాం. కొత్త చిగుళ్లు వచ్చి చెట్లు అయ్యాయి. సరైన యాజమాన్య పద్ధతులు పాటించకపోవడంతో 15 చెట్లు దెబ్బతిన్నాయి. మిగిలిన చెట్లకు దిగుబడులు వస్తున్నాయి. చెట్లను పూర్తిగా తొలగించే బదులు అంటు కట్టుకుంటే ఎంతో లాభం.

– రాంమోహన్‌రెడ్డి, పాలకొలను గ్రామం, ఓర్వకల్లు మండలం

కొత్త మొక్క లుగానే..

- 50 ఏళ్ల వయస్సు పైబడి కాపునకు రాని చెట్లతో పాటు కొత్త తోటల్లోని పనికిరాని చెట్ల పునరుద్ధరణకు ఈ పద్ధతి ఎంతో ఉపయోగం.
- చెట్లను పూర్తిగా తొలగించకుండా భూమికి మీటరున్నర ఎత్తు వరకు కొమ్మలను తొలగించాలి.
- కొమ్మలు తొలగించిన తర్వాత నీళ్లు కడితే సెప్టెంబర్, అక్టోబరు నెలలకు కొత్త చిగుళ్లు వస్తాయి.
- ఆ సమయంలో రైతుకు ఏ మామిడి రకంపై ఆసక్తి ఉందో ఆ రకం చెట్టులోంచి 15 నుంచి 20 చిన్న, చిన్న అంట్లు సిద్ధం చేసుకోవాలి.
- వీటి ఆకులను తొలగించి ఆరు రోజులకు కొత్త చిగుళ్లు వచ్చిన కొమ్మలపై పెన్సిల్ సైజులో రంధ్రాలు వేసి అంట్లను అందులో గ్రాఫింగ్ చేసుకోవాలి.
- నాటిన కొద్ది రోజులకే చిగుళ్లు వస్తాయి. ఎక్కడైతే నాటామో అక్కడి నుంచే పెరుగుదల మొదలవుతుంది.
- కొత్తగా నాటిన మొక్కల తరహాలో ఇవి కూడా పెరుగుతాయి.

పాత తోటల పునరుద్ధరణ



ఇప్పటి వరకు కాపునకు రాని పాత చెట్లను తొలగించి కొత్త మొక్కలు నాటుకోవడం చూస్తున్నాం. ఇప్పుడు ఆ బాధ లేకుండా అంటుకట్టు పద్ధతితో పాత తోటలను పునరుద్ధరించుకునే అవకాశం ఏర్పడింది. చాలా మంది రైతులు ఈ పద్ధతితో మేలైన దిగుబడులు పొందుతున్నారు. స్థల సమస్య ఉన్నా ఒక చెట్టుతోనే అంటుకట్టుతో అనేక వెరైటీలను అభివృద్ధి చేసుకునే అవకాశంఉంది. – పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి

తళుక్కుమంటున్న అదృష్టం

- ఒకే రోజు ముగ్గురికి వజ్రాలు లభ్యం
- ఒక వజ్రాన్ని రూ. 15 లక్షలు, పది తులాల బంగారం ఇచ్చి కొనుగోలు చేసిన వ్యాపారి



తుగ్గలి: తొలకరి వర్షాలకు వజ్రాల పంట పండుతోంది. ఈ ఏడాది ముందస్తు వర్షాలు బాగా కురుస్తుండడంతో విలువైన వజ్రాలు తళుక్కుమంటున్నాయి. జిల్లాలోని తుగ్గలి, మద్దికెర మండలాల్లో పలు గ్రామాల్లో ఎర్రనేలల్లో వజ్రాలు లభ్యమవుతుంటాయి. తుగ్గలి మండలంలో చెన్నంపల్లిలో 15 రోజుల క్రితం పొలం పనులకెళ్లిన ఓ మహిళకు రూ. 3.96 లక్షల విలువ చేసే వజ్రం, నాలుగు రోజుల క్రితం రామాపురంలో పొలానికి వెళ్లిన మరో మహిళకు రూ. 50 వేల విలువ చేసే వజ్రం లభ్యమైంది. మద్దికెర మండలం మదనంతపురంలో మూడు రోజుల క్రితం ఓ వ్యక్తి తనకు దొరికిన వజ్రాన్ని రూ.6.50 లక్షలకు విక్రయించారు. ఇదే గ్రామంలో శనివారం పొలం చూసేందుకు వెళ్లిన ఓ రైతుకు విలువైన వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని రూ.15 లక్షలు, 10 తులాల బంగారం ఇచ్చి ఓ వజ్రాల వ్యాపారి కొనుగోలు చేసినట్టు తెలిసింది. అలాగే జొన్నగిరిలో లభ్యమైన వజ్రాన్ని రూ.15వేలకు, పగిడిరాయిలో ఓ మహిళకు దొరికిన వజ్రాన్ని రూ.12 వేలకు వజ్రాల వ్యాపారులు కొనుగోలు చేశారు. ఈ సారి ముందస్తు వర్షాలు కురుస్తుండడంతో రెండు తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక నుంచి జనం ఇక్కడి వచ్చి వజ్రాన్వేషణ చేస్తున్నారు. అనంతపురం జిల్లా గుత్తి, వజ్రకరూర్ మండలాల్లో కూడా విలువైన వజ్రాలు లభ్యమవుతున్నట్లు తెలుస్తోంది.

వావ్.. బసవా

- రూ.15 లక్షలు పలికిన ఎద్దు



గోనెగండ్ల: సాధారణంగా ఒక ఎద్దు విలువ రూ.30 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతుంది. కాని ఏకంగా గోనెగండ్ల మండలం చిన్న నేలటూరు గ్రామంలో ఓ ఎద్దు ధర రూ.15 లక్షలు పలికింది. ఇది జిల్లాలోనే అత్యధిక ధరగా ప్రజలు చర్చించుకుంటున్నారు. గ్రామానికి చెందిన గాజుల కుమారస్వామి, గాజుల అమరేశ్వరప్పకు చెందిన వృషభాలు రాష్ట్రంలో ఎక్కడ బండలాగుడు పోటీలు జరిగినా బరిలో నిలుస్తాయి. ఈ ఎద్దులకు ఈ ప్రాంతంలో మంచి క్రేజ్ ఉంది. ఇందులో ఒక ఎద్దును శనివారం అనంతపురం జిల్లా ఏ. నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ నజీర్ బాషా రూ.15 లక్షలకు కొనుగోలు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆ ఎద్దును చూసేందుకు బారులుదీరారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష
- జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలు ఎంపిక

కర్నూలు సిటీ: జాతీయ స్థాయిలో పేరొందిన విద్యా సంస్థలలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు ప్రవేశాల కోసం జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్ – 2024 పరీక్ష నేడు (ఆదివారం) జరగనుంది. కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించనున్న ఈ పరీక్షకు జిల్లాలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు హాజరుకానున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మద్రాసు ఐఐటీ నిర్వహిస్తోంది. అభ్యర్థులు పేపర్-1, పేపర్-2 పరీక్షలను కచ్చితంగా రాయాల్సి ఉంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది అధికంగా జేఈఈ మెయిన్స్‌కు హాజరై మంది అర్హత పొందడంతో అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు ఎక్కువ మంది రిజిస్టర్ చేసుకున్నారు. పరీక్ష సమయానికి గంట ముందు నుంచే కేంద్రంలోకి అనుమతించనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్షకు హాజరు అవుతున్న విద్యార్థులకు కచ్చితంగా డ్రెస్ కోడ్‌ను అమలు చేయనున్నారు. బూట్లు, బంగారు ఆభరణాలు, దుస్తులకు పెద్ద సైజులో బటన్స్ ఉండకూడదు. ఫుల్ స్లీవ్ దుస్తులను ధరించరాదు. పరీక్షలో బాల్ పాయింట్ పెన్నును మాత్రమే వినియోగించాలి. పెన్సిల్, ఎరేజర్, సాధారణ చేతివాచీని తెచ్చుకోవచ్చు. ఎలాంటి డిజిటల్ వస్తువులు తెచ్చుకోకూడదు. కేంద్రంలో కేటాయించిన సీటులో కూర్చున్న తరువాత అడ్మిట్‌కార్డులోని పేరు, పేపర్, పుట్టిన తేదీ, జెండర్ వంటి వివరాలను చెక్ చేసుకోవాలి.

సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా

- కౌంటింగ్ రోజు అల్లర్లు, ఘర్షణలను అడ్డుకోండి
- జిల్లా భద్రతా ప్రణాళిక కమిటీ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి సృజన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్రంలో ఎస్పీ జి.కృష్ణకాంత్

కర్నూలు(సెంట్రల్): జూన్ 4వ తేదీన జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన పోలీసులకు సూచించారు. ఇంటలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండి ప్రశాంతం వాతావరణం నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కౌంటింగ్ రోజున చేపట్టాల్సిన భద్రత పరమైన అంశాలపై చర్చించేందుకు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా భద్రతా ప్రణాళిక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ తోపాటు అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మే 13వ తేదీన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, ఇందుకు పోలీసుల కృషియే కారణమని ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో కౌంటింగ్ రోజున జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ముందుగా గత ఎన్నికల సమయాల్లో అల్లర్లు జరిగిన సున్నితమైన ప్రాంతాలను గుర్తించి అక్కడ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. మండల హెడ్ క్వార్టర్స్‌లో ఎగ్జిక్యూటీవ్ మెజిస్ట్రేట్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ నిబంధనలు, నియమాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని ఆర్వోలను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలింగ్ రోజున జరిగిన సంఘటనల ఆధారంగా జిల్లాలో మొత్తం 188 సున్నితమైన ప్రాంతాలు గుర్తించి పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ పట్టణాల నుంచి రాయలసీమ యూనివర్సిటీకి వచ్చే రహదారుల్లో 31 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాణసంచా పేల్చేందుకు అనుమతి లేదని, కౌంటింగ్ రోజున వాటిని విక్రయించడానికి వీలులేదని గోడౌన్ యజమానులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎన్.నాగరాజు, నాగబాబు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయండి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లన్నీ ఈనెల 28వ తేదీ లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆర్వోలు, ఏఆర్వోలు, కౌంటింగ్ నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల హాళ్లలోని లోపల, బయట చేపట్టే అన్ని రకాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. పోలీసులతో సమన్వయం చేసుకొని ఏజెంట్లను గుర్తించే ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మొబైల్ డిపాజిట్ సెంటర్, లంచ్ టెంట్లను కూడా ఏర్పాటు చేయాలని డీఆర్వో, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలను ఆదేశించారు. జూన్ 3వ తేదీన జిల్లా ట్రెజరీ నుంచి పోస్టల్ బ్యాలెట్లను రాయలసీమ యూనివర్సిటీకి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆర్వోలు నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివ్‌నారాయణ్ శర్మ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కర్నూలు(అర్బన్): జిల్లాలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థినీ, విద్యార్థులకు ఈ నెల 26న (ఆదివారం) ప్రతిభా పురస్కారాలను అందించనున్నట్లు బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షులు సందేల్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు విద్యాపరంగా మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్థానిక పెద్ద మార్కెట్, వాసవీ మహిళా డిగ్రీ కళాశాల సమీపంలోని బ్రాహ్మణ వీధి ఉత్తరాధిమఠంలో ఈ కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటో, గిఫ్ట్ అందించి శాలువాలతో సత్కరిస్తామన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశామన్నారు.

గిరిజన యువకుడిపై ఎలుగుబంటి దాడి



గాయపడిన బయన్న

శ్రీశైలంప్రాజెక్ట్: ఇష్టకామేశ్వరీమాత ఆలయానికి 10 కిలో మీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో గిరిజన యువకుడిపై ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. శనివారం మధ్యాహ్నం ఈ సంఘటన జరిగింది. ప్రకాశంజిల్లా ఎర్రగొండపాలెం మండలం గాంధీ నగర్‌కు చెందిన యువకుడు బయన్న ఇష్టకామేశ్వరీమాత ఆలయం సమీపంలో అటవీ ఫలాల సేకరణకు వెళ్లాడు. అదే ప్రాంతంలో ఉన్న ఎలుగుబంటి అకస్మాత్తుగా ఆ యువకుడిపై దాడి చేసి గాయపరిచింది. సమాచారం తెలుసుకున్న అటవీ సిబ్బంది బయన్నను సున్నిపెంట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయితే, గాయాలు తీవ్రంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి రెఫర్ చేశారు.

అనుమతులు పొందిన విత్తనాలనే విక్రయించాలి

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ అనుమతులు పొందిన రకాల విత్తనాలనే మార్కెట్‌లో విక్రయించాలని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. శనివారం పట్టణంలోని పలు విత్తన శుద్ధి కేంద్రాల్లో వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఏఓ ప్రసాదరావు ఆధ్వర్యంలో జనార్దన్‌రెడ్డి సీడ్స్, ధనలక్ష్మి అగ్రోటెక్, నాగ అగ్రిటెక్‌లలో ప్రాసెసింగ్, డిస్పాచ్, ఫౌండేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం విత్తన ప్రాసెసింగ్ విధానంపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విత్తన నాణ్యత ప్రమాణాలను తెలుసుకునేందుకు ఆయా కేంద్రాల్లో విత్తన నమూనాలను తీసి ప్రయోగశాలకు పంపారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ విత్తనాలు ప్రాసెసింగ్ చేసే వారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కల్తీ లేకుండా చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలను తయారు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవం.. పాండురంగడి రథోత్సవం

- జనసందోహం నడుమ ముందుకు సాగిన రథం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు



జన సందోహం మధ్య పాండురంగస్వామి రథోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడి స్వామి రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రితో స్వామి వారి వాహన సేవలు ముగియగా తొమ్మిదవ రోజు స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు ఉదయం 11గంటలకు హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, డ్రమ్స్, డప్పులతో అశేష జనవాహిని మధ్య రథోత్సవం సాగింది. ఆలయం నుంచి రంగరాజుపేట, సంతపేట, అమ్మవారిశాల, గాంధీసెంటర్ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పట్టణ ప్రజలే కాకుండా చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని మైదుకూరు, బెంగళూరుకు చెందిన కళాకారులు కాళికాశక్తి, భద్రకాళి, బుట్టబొమ్మలు, తదిర వేషాధారణలు, చెక్క భజన కార్యక్రమాలు అలరించాయి. హైదరాబాద్ నుంచి తెప్పించిన డ్రోన్ ద్వారా భక్తులపై పన్నీరు చల్లించారు. రథోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, సర్కిల్ ఎస్‌ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్, రాంమోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తమ సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మైలతేరు కార్యక్రమం జరుగుతుంది.



అలరించిన కాళికాశక్తి, భద్రకాళి, తదితర వేషధారణలు



కోలాటం ఆడుతున్న మహిళలు

ఇసుక, మద్యం అక్రమ రవాణాపై సెబ్ దాడులు



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన అధికారులు

కర్నూలు: ఇసుక, మద్యం అక్రమ రవాణాపై సెబ్ అధికారులు దాడులు విస్తృతం చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు శనివారం కూడా జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 9 మందిపై కేసులు నమోదు చేసి 36 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. 9 ట్రాక్టర్లు జప్తు చేసి రూ.90వేలు అపరాధ రుసుం విధించి ప్రభుత్వ ఖజానాకు జమ చేశారు. కర్నూలు సెబ్ స్టేషన్ పరిధిలోని తుంగభద్ర, హంద్రీ నదుల నుంచి ఇసుక తరలిస్తున్న కర్నూలు మండలం శింగవరం గ్రామానికి చెందిన బోయ వీరాంజనేయులు, మదనగోపాల్, లక్ష్మీపురం గ్రామానికి చెందిన సంజన్న, బీరయ్య, కర్నూలుకు చెందిన ఓంనాథ్ తదితరులకు చెందిన 5 ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అలాగే పొరుగు రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక నుంచి మద్యం తరలిస్తున్న వారిపై నిఘా ఉంచి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 157 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాటుసారా స్థావరాలపై కూడా దాడులు కొనసాగుతున్నాయి. దాదాపు 1400 లీటర్ల నాటుసారాకు ఉపయోగించే బెల్లంఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇద్దరి అమ్మకందారులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



వెంకటరాముడు (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని బోంచెర్వుపల్లి గ్రామానికి చెందిన వెంకటరాముడు (41) అనే వ్యక్తి శనివారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరాముడు లక్ష్మితండా సమీపంలో ఉన్న తన పొలానికి నీరు కట్టేందుకు వెళ్లాడు. స్టాటర్ బాక్స్‌లో ఉన్న స్విచ్ ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలాడు. ఇంటి పెద్ద మృతితో కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది. మృతుడికి భార్య లక్ష్మిదేవి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాచర్ల పోలీసులు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే చనిపోయాడు

- కుమారుడి మృతిపై తండ్రి ఆవేదన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని కిమ్స్ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన కుమారుడు చనిపోయాడని రిటైర్డ్ ఉద్యోగి డి.పి. స్వామన్న వాపోయారు. న్యాయం కోసం ఆసుపత్రి యాజమాన్యం చుట్టు తిరిగినా పట్టించుకోవడం లేదని అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కుమారుడు డి. సురేష్ బాబు(50)ను 3వ తేది రాత్రి 9 గంటల సమయంలో స్పృహలేని పరిస్థితిలో చికిత్స నిమిత్తం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పాను. అతనికి సిటీ స్కాన్, ఎక్స్‌రే తదితర పరీక్షలన్నీ చేశారు. అందులో ఊపిరితిత్తులకు జబ్బు ఉందని, వెంటనే ఊపిరితిత్తుల నిపుణులు డాక్టర్ వెంకటచలమయ్యను పిలిపిస్తామని, అందుకు ఫీజు రూ.8,250 అవుతుందంటే వెంటనే చెల్లించా. మెడికల్ ఐసీయూలో ఉంచి కుటుంబసభ్యులను ఎవ్వరినీ రానివ్వలేదు. మరునాడు (4వ తేది)ఉదయం10 గంటల వరకు కూడా నా కుమారుడిని చూసేందుకు డాక్టర్ వెంకటచలమయ్య రాలేదు. కానీ మందులు మాత్రం తెప్పిస్తూనే ఉన్నారు.చివరకు నా కుమారుడు చనిపోయాడని ముగ్గురు డాక్టర్లు వచ్చి చెప్పారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. వస్తానన్న డాక్టర్ వెంటనే రాకపోవడం, వైద్యులు సరిగా స్పందించకపోవడమే సురేష్‌బాబు మృతికి కారణమని ఆరోపించారు. ఈ విషయమై ఆసుపత్రి సీఈఓ సునీల్‌ను 'సాక్షి' వివరణ కోరగా రోగి ఆసుపత్రికి వచ్చిన సమయంలోనే సీరియస్ కండీషన్‌లో ఉన్నట్లు చెప్పారు. అవసరమైన అన్ని రకాల వైద్యసేవలు అందించినా కోలుకోలేక చనిపోయాడన్నారు. ఈ విషయంలో తమ వైద్యుల నిర్లక్ష్యం లేదని వెల్లడించారు.

విషాదం

ఆర్థిక ఇబ్బందులతో దంపతుల ఆత్మహత్య

- జలదుర్గంలో ఘటన



సుంకన్న, లక్ష్మీదేవి (ఫైల్)

ప్యాపిలి: ఓ వైపు ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి.. మరో వైపు కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. దీంతో దిక్కుతోచని ఆ దంపతులు పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నారు. మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన సుంకన్న (50), లక్ష్మీదేవి (45) దంపతులకు మధుశేఖర్, మధుకృష్ణ, మహేశ్వరి సంతానం. వీరందరికీ వారు వివాహాలు చేశారు. కుమారులు, కోడళ్లతో సంతోషంగా ఉండాల్సిన ఆ దంపతులకు కొన్నాళ్లకే ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. రెండు ఎకరాల పొలంలో పంట సాగుకు, కుటుంబ పోషణకు స్థానికంగా అప్పులు చేశారు. వాటిని తీర్చే విషయంలో తరచూ కుటుంబ సభ్యుల మధ్య వివాదం జరుగుతోంది. ఈనెల 23వ తేది రాత్రి ఇదే విషయంపై తండ్రి, కుమారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ విషయంలో మనస్తాపానికి గురైన ఇంటి పెద్దలు సుంకన్న, లక్ష్మీదేవి అదేరోజు రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో సుంకన్న మృతి చెందాడు. భర్త మృతి చెందిన కొద్ది గంటలకే లక్ష్మీదేవి కూడా తనువు చాలించింది. మృతుల కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జలదుర్గం ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.



మృతులను చూసేందుకు తరలివచ్చిన గ్రామస్తులు

తరలివచ్చిన గ్రామస్తులు

సుంకన్న, లక్ష్మీదేవిల ఆత్మహత్యతో జలదుర్గంలో తీవ్ర విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం శనివారం సాయంత్రం అంబులెన్స్‌లో మృతదేహాలను తీసుకురాగానే చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు.

ఆదోనిలో దొంగలు హల్‌చల్



దుకాణానికి వేసిన కన్నం చూపిస్తున్న చిరువ్యాపారి లక్ష్మి

ఆదోని అర్బన్: పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. చిరు వ్యాపారులకు సంబంధించి ఐదు దుకాణాల్లో చొరబడి కొంత నగదు, స్వీట్స్ అపహరించుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆస్పరి రోడ్డులో బైపాస్‌కు సమీపంలో చిన్నపాటి బేకరీ, బీడీ బంకు, టీ స్టాల్, కూల్ డ్రింక్ షాపు, మెస్ దుకాణాలు ఉన్నాయి. ఆయా దుకాణాల డబ్బా రేకులను కోసి లోపలికి దూరి కొంతనగదుతో పాటు స్వీట్స్, కూల్ డ్రింక్స్, బీడీలు, సిగరెట్లు ఎత్తుకెళ్లారు. ముందు జాగ్రత్తగా పోలీసులకు దొరకకుండా దుండగులు సమీపంలోని సీసీ కెమెరాలను సైతం పగలగొట్టినట్లు బాధితులు లక్ష్మి, మల్లికార్జున తెలిపారు. తర్వాత చోరీ ఘటనపై చిరువ్యాపారులు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



పట్టుబడిన టిప్పర్లను చూపుతున్న సీఐ, పోలీసులు

నందికొట్కూరు రూరల్: మండల పరిధిలోని శాతనకోట గ్రామం వద్ద తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను, ఒక జేసీబీని పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారంతో తనిఖీ చేసి పట్టుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. ఇసుక అక్రమ రవాణా వాహనాల సీజ్‌తో పాటు 8 మందిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఉపాధి నిధులతో పండ్లతోటల అభివృద్ధి

- జాబ్ కార్డు కలిగి ఉండి... 5 ఎకరాల్లోపు భూమి కలిగిన వారందరూ అర్హులే
- జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): కరువు ప్రాంతాల్లో 2024–25 సంవత్సరానికి పండ్లతోటలను 100 శాతం సబ్సిడీతో అభివృద్ధి చేసుకోవచ్చని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది 10 వేల ఎకరాల్లో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 3,500 ఎకరాలను గుర్తించామన్నారు. జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు పడుతుండటం పండ్లతోటల అభివృద్ధికి చక్కటి అవకాశమన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులతో పాటు చిన్న, సన్నకారు రైతుల స్థిరాస్తిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పండ్లతోటల సాగును ప్రోత్సహిస్తోందన్నారు. 100 శాతం సబ్సిడీతో 17 రకాల పండ్లతోటల అభివృద్ధికి అవకాశం ఉందన్నారు. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, చింత, ఆపిల్‌బేర్(రేగు), డ్రాగన్‌ఫ్రూట్స్, అంజూర, పూలతోటలకు సంబంధించి గులాబి, మల్లె తోటలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డుతో పాటు భూమి పట్టాదారు పాసుపుస్తకం ఉంటే వంద శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. మెట్టభూములు, చౌడు భూముల్లోనూ పండ్లతోటలు అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9121103297 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



అభివృద్ధి చెందిన పండ్లతోట